# 'యాక్ట్'లో రూ.3200 కోట్ల పెట్టుబడి

## 95% వాటాలు కొనుగోలు చేసిన ఐవిఎఫ్ఎ, టిఎ అసోసియేట్స్.. ఏడు లక్షల మంది ఆదరణ




కార్యక్రమంలో పాల్గొన్న యాక్ట్ ప్రతినిధులు

బెంగళూరు/నెల్లూరు (ఆంధ్రజ్యోతి) : కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో హైస్పీడ్ బ్రాడ్‌బ్యాండ్ సేవలు అందిస్తున్న 'అట్రియా కన్వర్జెన్స్ టెక్నాలజీ (యాక్ట్) కంపెనీలో ప్రైవేట్ ఈక్విటీ సంస్థ టీఏ అసోసియేట్స్ 40 శాతం (సుమారు రూ. 1200 కోట్లు) వాటా తీసుకుంది. ఇప్పటికే కంపెనీలో వాటా ఉన్న ఇండియా వాల్యూ ఫండ్ అడ్వైజర్ (ఐవీఎఫ్ఏ) తన వాటాను అమ్మి ఇండియం (మారిషస్)ఫండ్ ద్వారా కొత్తగా 30 కోట్ల డాలర్ల (సుమారు రూ.2000 కోట్లు) పెట్టుబడి పెడుతున్నట్లు ఆ సంస్థ ప్రతినిధి ప్రమోద్ కొఠారి ఆదివారం జరిగిన ఒక కార్యక్రమంలో చెప్పారు. దీంతో కంపెనీలో యాక్ట్ ప్రమోటర్లు సుందర రాజు, నాగరాజుల వాటా ఐదు శాతానికి పడిపోయింది. అయినా కంపెనీ మేనేజ్‌మెంట్‌లో ఎలాంటి మార్పు ఉండదని ప్రమోద్ కొఠారి ప్రకటించారు. మూడు రాష్ట్రాల్లో ఏడు లక్షల మందికిపైగా ఖాతాదారులకు అత్యంత వేగవంతమైన ఇంటర్నెట్ సేవలు అందించడంలో యాక్ట్ ముందంజలో ఉందని చెప్పారు. యాక్ట్ కార్యకలాపాలను మరిన్ని నగరాలకు విస్తరించనున్నట్లు యాక్ట్ ఎండీ సుందర రాజు చెప్పారు. సంస్థ అభివృద్ధి కోసం నిబద్ధతతో కృషి చేస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం తమ కేబుల్ టీవీ ద్వారా 500కు పైగా ఎస్‌డీ, హెచ్‌డీ చానళ్లు అందిస్తున్నట్లు యాక్ట్ సీఈవో బాల మల్లాది తెలిపారు. గత ఏడేళ్లుగా తాము అనుసరించిన వృత్తిపరమైన ప్రమాణాలే కేబుల్ టీవీ, బ్రాడ్‌బ్యాండ్ రంగాల్లో తమకు స్థాయిని తీసుకువచ్చాయన్నారు. ఐవీఎఫ్ఏ, టీఏ అసోసియేట్స్ సహాయంతో మరింత ఉన్నత స్థాయికి చేరుకుంటామని ఆశాభావం వ్యక్తం చేశారు.